క్లుప్తంగా

హెల్త్ కార్డుల అందజేత



ఖలీల్‌వాడి: జిల్లాకోర్టు ప్రాంగణంలోని నిజామాబాద్ బార్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం న్యాయవాదులకు హెల్త్ కార్డులను బార్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యురాలు పరిపూర్ణరెడ్డి అందజేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి న్యాయవాది ఆరోగ్యపరంగా ఎలాంటి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దనే లక్ష్యంతో రాష్ట్ర అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులను అందజేశామన్నారు. పరిపూర్ణ మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు హెల్త్ కార్డులను పంపిణీ చేస్తామని తెలిపారు. బార్ ప్రతినిధులు రాజు, వసంత్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



నిజామాబాద్‌నాగారం: యాదగిరిగుట్ట వద్ద నేడు నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్ అన్నారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై మరోసారి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి వర్గీకరణ చేయాలన్నారు. సదస్సుకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నాయకులు భూమన్న, రవీందర్, రాజేశ్వర్, దేవన్న, పోశెట్టి ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



మోపాల్: మండలంలోని మంచిప్ప శివారులో ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలి విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గూండ్ల సాయవ్వకు చెందిన గేదె గ్రామంలోని అన్ని గేదెలతో కలిసి రోజూవారీలాగే మేతకు మంగళవారం వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో పెద్దమ్మ ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. సుమారు రూ.80వేల గేదె మృతి చెందిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

కొనసాగుతున్న డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్ (కామారెడ్డి), ఎస్ఆర్ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 19 మందికి 17 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 107 మందికి 99 మంది హాజరు కాగా 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

సబ్‌స్టేషన్ సందర్శన

ఆర్మూర్‌టౌన్: మండలంలోని గోవింద్‌పేట్ సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ మంగళవారం సందర్శించారు. గ్రామంలో విద్యుత్ సరఫరా విషయంలో నెలకొన్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని, లైన్‌మన్ గోపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఈకి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

పోలీసుల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్: పట్టణ శివారు ప్రాంతాలను పోలీసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ సబ్‌డివిజన్‌లోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది రైల్వేస్టేషన్, పెర్కిట్, నల్లపోచమ్మ ఆలయం, అంకాపూర్, గూండ్ల చెరువు ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తుపదార్థాలను విక్రయిస్తున్న విషయమై తనిఖీ చేశారు. అలాగే కిరాణ దుకాణాలు, పాన్‌షాప్‌లలో తనిఖీలు చేపట్టారు.

అంగన్‌వాడీ బాట

మోర్తాడ్: మోర్తాడ్‌లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ పాఠశాలల ఆవశ్యకతను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కార్యకర్తలు జ్యోతి, సువార్త, సులోచన, శారద, గంగాజమున, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ సర్టిఫికెట్ తప్పనిసరి

- ప్రయివేట్ బడులు, కళాశాలలకు..
- లేదంటే విద్యాశాఖ రెన్యూవల్, అనుమతులు ఇవ్వొద్దు
- నగరంలో అధికారుల సర్వే

నిజామాబాద్‌నాగారం : ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలకు తప్పనిసరిగా శానిటరీ సర్టిఫికేట్ ఉండాల్సిందే. మున్సిపాలిటీ నుంచి ప్రతి పాఠశాల, కళాశాలకు శానిటేషన్‌కు సంబంధించి ఎన్‌ఓసీ ఉండాలి. ఇది లేకుంటే విద్యాశాఖాధికారులు ఆయా పాఠశాలలు, కాలేజీలను రెన్యూవల్ చేయకూడదు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఎన్‌ఓసీ లేకుండానే అధికారులు ఇష్టారాజ్యాంగా అనుమతులు ఇస్తూనే ఉన్నారు. మున్సిపల్ నుంచి కూడా ఎన్‌ఓసీ పై పట్టింపు లేకుండా పోయింది. తాజాగా మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. నగరంలో ఉన్న ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీలలో ఎన్‌ఓసీ ఉందో లేదో తెలుసుకోవడానికి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో సర్వే చేసి, పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు.



విద్యాసంస్థల్లో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

కమిషనర్ ప్రత్యేక దృష్టి..

మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఏడాది ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు పుట్టుకొస్తునే ఉన్నాయి. వీటికి తోడు ప్రతి ఏడాది డీఈవో కార్యాలయంలో ప్రయివేట్ పాఠశాలలు రెన్యూవల్ చేసుకుంటున్నాయి. అయితే మున్సిపాలిటీ నుంచి శానిటేషన్ సర్టిఫికెట్ ఎన్‌ఓసీ ఉండాలనే నిబంధనను మున్సిపల్ శానిటేషన్ అధికారులు, అటు విద్యాశాఖాధికారులు మర్చిపోయారు. యథావిధిగా రెన్యూవల్ చేయడం, అనుమతులు ఇవ్వడం గమనార్హం. కమిషనర్ మకరందు, డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ రెవెన్యూ పెంచడానికి ప్రత్యేకంగా దృష్టిపెట్టడంతో శానిటేషన్‌లో పాఠశాలల నుంచి రెవెన్యూ గత కొన్నిసంవత్సరాలుగా సక్రమంగా రావడం లేదని గుర్తించారు. దీనిపై ప్రస్తుతం ఉన్నతాధికారులు ఫోకస్ పెట్టడంతో ఇటు రెవెన్యూ పెరగడంతో పాటు మున్సిపాలిటీ నిబంధనలు సైతం పాటించాల్సిన అవసరం ప్రైవేట్ పాఠశాల, కళాశాలకు తప్పనిసరి కానుంది.

నిబంధనల ప్రకారం..

నగరంలో సుమారు 120కి పైగా ప్రయివేటు స్కూల్స్, పదుల సంఖ్యలో కాలేజీలు ఉన్నాయి. అంతేకాకుండా పీజీ కళాశాలలు సైతం ఉన్నాయి. మున్సిపాలిటీకి ప్రతి ఏడాది నిబంధనల ప్రకారం ప్రయివేట్ పాఠశాలలలో చదివే విద్యార్థులకు సంబంధించి ఒక్కో విద్యార్థి నుంచి రూ. 35ఫీజు, కాలేజ్ విద్యార్థి నుంచి రూ.45ఫీజు చెల్లించాలి. అంతేకాకుండా సుమారు 40మందిలోపు విద్యార్థులు ఉంటే రెండు టాయ్‌లెట్స్, మరుగుదొడ్లు వేర్వేరుగా ఉండాలి. అంతకన్నా ఎక్కువగా ఉంటే విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాల, కళాశాలలో టాయ్‌లెట్స్, మరుగుదొడ్లు ఉండాలి. అలా ఉంటేనే ఆ ఏరియా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పాఠశాలను తనిఖీ చేసి ఎన్‌ఓసీ జారీ చేస్తారు.

పూర్తి వివరాలు సేకరిస్తున్నాం

ఇప్పటికే శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లతో కలిసి ఆయా జోన్‌ల పరిధిలో ఉన్న ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో సర్వే చేస్తున్నారు. ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో లెక్కలు తీస్తున్నారు. దానికి అనుగుణంగా మున్సిపాలిటీకి రావాల్సిన ఫీజు వసూలు చేస్తాం. నిబంధనల ప్రకారం టాయిలెట్స్, మరుగుదొడ్లు ఉంటేనే ఆయా విద్యాసంస్థలకు ఎన్‌ఓసీ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాం.

– మంద మకరందు, మున్సిపల్ కమిషనర్

నేటి చిత్రం..

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నిజామాబాద్ నగరంలోని 18 డివిజన్ జనప్రియ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 4లో వర్షపునీరు నిలిచి అధ్వానంగా మారింది. అలాగే డ్రెయినేజీలు సైతం సరిగా లేక పోవడంతో మురుగునీరుసైతం రోడ్డుపైనే పారుతోంది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



జనప్రియ నగర్ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

పోరాటాల ఫలితంగానే కార్మికుల వేతనాలు విడుదల

ధర్పల్లి: పోరాటాల ఫలితంగానే గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాల చెల్లింపుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశామన్నారు. మిగతా డిమాండ్ల పరిష్కారం కోసం కార్మికులు భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు దామోదర్, ఆశిష్, ఆశన్న, సాయిలు, సాయినాథ్, సులోచన, సాయవ్వ, శారదా, విలాష్, సంతోష్, రజిత ఉన్నారు.

డిచ్‌పల్లి: గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం జీపీ కార్మికుల పెండింగ్ జీతాలను విడుదల చేసిందని జిల్లా నాయకుడు మురళి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. యూనియన్ కార్మికుల సమష్టి కృషి ఫలితంగానే సాధ్యమయిందన్నారు. కార్మికులు రాజేందర్, నర్సయ్య, సుమన్, బుచ్చయ్య, రాజేశ్వర్ పా ల్గొన్నారు.



ధర్పల్లిలో మాట్లాడుతున్న నాయకులు

ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్రలు మానండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు
- త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్‌పీ విలీనం తథ్యం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్రలు పన్నుతూ, నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ఎంతగా ప్రయత్నించినా త్వరలోనే కాంగ్రెస్‌పార్టీలో బీఆర్ఎస్ఎల్‌పీ విలీనం కావడం తథ్యమని పేర్కొన్నారు. నగరపరిధిలోని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ కోసం జీవో జారీ చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సంబంధించి రూ.32వేల కోట్లు రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. రుణమాఫీ మార్గదర్శకాలపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు మతిస్థిమితం లేని మాటలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పేదలకు సన్నబియ్యం అందించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం సన్నరకాలకు ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాలి కానీ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే దుర్మార్గమైన ఆలోచన మానుకోవాలని హితవు పలికారు. మాజీ ఎంపీ కవితకు బెయిల్ కోసమే కేటీఆర్, హరీష్‌రావు ఢిల్లీలో మకాం వేసి బీజేపీ నాయకుల కాళ్లు మొక్కుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఎంపీ అర్వింద్ పేర్కొనడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్లలో జిల్లా అభివృద్ధికి అర్వింద్ చేసింది శూన్యమన్నారు. నిజమైన రైతులకే రైతుభరోసా అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, సీనియర్ నాయకులు జావేద్ అక్రం, ముప్ప గంగారెడ్డి, ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్, డిచ్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, ఎల్లయ్య, భోజన్న, నవీన్‌గౌడ్, రవి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

డిచ్‌పల్లి: 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ వీఆర్ఏ జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



ఆర్వోబీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నిధులు మంజూరు చేయాలని వినతి

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన రెడ్డి సంఘం, గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మంగళవారం కలిశారు. ఆయా సంఘాల సమస్యలను సభ్యులు ఎమ్మెల్యేతో చర్చించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేను వారు సన్మానించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆర్మూర్‌పెద్ద గంగారెడ్డి, సతీష్, గంగారెడ్డి, భూమాగౌడ్, పెద్ద రాజాగౌడ్, రామాగౌడ్, కళ్యాణ్, చందుగౌడ్ పాల్గొన్నారు.

మాధవనగర్ ఆర్వోబీ పనుల పరిశీలన

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను మంగళవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారుతో మాట్లాడి పనుల గురించి తెలుసుకున్నారు. 2025 మే నాటికి వంతెన అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డితో మాట్లాడి వంతెన నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా మంజూరు అయ్యేలా కృషి చేస్తాని అన్నారు. అర్సపల్లి ఆర్వోబీ పనులు 30శాతం పూర్తయ్యాయని అన్నారు. ఎస్ఈ హనుమంతు, జిల్లా కిసాన్‌కేత్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, నాయకులు సాయిబాబా, వాసు, అగ్గ బోజన్న పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: నగరంలోని చంద్రశేఖర్‌కాలనీలోగల అర్బన్‌హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులు, ఇతర టెక్నిషియన్స్, కిందిస్థాయి సిబ్బంది పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పక్కాగా అందుబాటులో ఉండాలని నిబంధన ఉంది. కానీ సాయంత్రం 3.30గంటల కంటే ముందే అందరు వెళ్లిపోయారు. కేవలం ల్యాబ్‌టెక్నిషియన్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ గదికి తాళం వేసి ఉంది. ఇదేంటని ల్యాబ్‌టెక్నిషియన్ అడిగితే సార్ ఇప్పుడే వెళ్లారని చెప్పి తప్పించుకునే విధంగా మాట్లాడారు. ఎవరైన వస్తే రేపు రమ్మని చెప్పి, పంపించిన సంఘటనలు కోకొల్లుగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్బన్‌హెల్త్ సెంటర్‌లు, మండలాల్లోని పీహెచ్‌సీలల్లో కచ్చితంగా సమయ పాలన పాటించాలని డీఎంహెచ్‌వో ఆదేశాలు ఇచ్చారు. ప్రతినిత్యం తనిఖీలు చేస్తున్నారు. అయినా సిబ్బంది సమయపాలన పాటించకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకుండ ఉంటే రోగులకు వైద్య సేవలు ఎలా అందుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చంద్రశేఖర్‌కాలనీ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేయండి

నిజామాబాద్ అర్బన్: నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలలో మధ్యాహ్నభోజన ఏజెన్సీని రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అంజలి కోరారు. ఈమేరకు వారు మంగళవారం ఎంఈవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి నాణ్యమైన భోజనం అందించని ఏజెన్సీని రద్దుచేయాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖలీల్‌వాడి: లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌస్‌ల వద్ద పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ కార్యదర్శి, లిఫ్ట్ ఇరిగేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్మికులతో కలిసి జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద ధర్నా చేశారు. అనంతరం ఇరిగేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారులకు, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రమేష్ బాబు మాట్లాడుతూ.. గుత్ప, అలీసాగర్ పరిధిలోని వివిధ పంప్‌హౌస్‌ల వద్ద పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. నాయకులు గణేష్, మహిపాల్, కార్తీక్, సీతారాం నాయక్, బుచ్చన్న, అజయ్, నరేష్, రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలి



సుభాష్‌నగర్: జిల్లాలో పని చేస్తున్న స్కూల్ స్వీపర్స్ (పీటీఎఫ్)కు బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని పీటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్, యూపీఎస్, పీఎస్‌లలో విధులు నిర్వర్తిస్తున్న తమకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి వేతన బకాయిలు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. పీటీఎఫ్‌లు అశోక్, గౌరవ్వ తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	220
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,100	వెండి (కిలో)	94,250
22 క్యారెట్స్	68,080		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	48	70	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	25	50	దోసకాయ	15	30
దొండకాయ	10	20	ఆలుగడ్డ	30	50
జిల్లేసుకాయ	60	90	గోబిగడ్డ	35	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	35	50
వంకాయ	10	20	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	40	60
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	70	చిక్కుడుకాయ	60	90
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	భారతీయుడు-2 (తెలుగు)-9.00, 12.30, 4.00, 7.25, 10.50
స్క్రీన్-2	భారతీయుడు-2(తెలుగు) -10.00 కల్కి-2898 ఏడీ(తెలుగు) -1.30, 3.20, 7.00 కల్కి-2898 ఏడీ(తెలుగు) -6.45
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ(తెలుగు) -10.30, 1.30, 3.20, 07.00, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ (3డీ తెలుగు)-11.00, 6.30 కల్కి-2898 ఏడీ(హిందీ)-2.45,10.15
స్క్రీన్-2	భారతీయుడు-2 (తెలుగు) - 11.15, 3.00, 6.45, 10.30
స్క్రీన్-3	కిల్(హిందీ) -12.15, 2.45, 9.00 భారతీయుడు - 2 (తెలుగు)- 5.15
స్క్రీన్ -4	సరఫరా (హిందీ) - 12.20, 3.40, 7.00, 10.20
దేవి	భారతీయుడు-2 (తెలుగు)
నటరాజ్	భారతీయుడు-2 (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

సంక్షిప్తం

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



నిజామాబాద్‌నాగారం: కల్వకుర్తిలో ఇటీవల తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో నగరంలోని విజయ్ స్కూల్ విద్యార్థులు పాల్గొని, ప్రతిభ చాటారు. విద్యార్థులు మధుశ్రీ, జాహ్నవి, హరిణి ద్వితీయ స్థానంలో నిలిచారు. మంగళవారం విద్యార్థులను స్కూల్ వ్యవస్థాపకురాలు అమృతలత అభినందించారు.

లేగదూడకు చికిత్స



సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్‌లో గల అమరవీరుల పార్క్ వద్ద ఓ లేగదూడ అపస్మారక స్థితిలో పడిఉంది. దీంతో పశువైద్యాధికారులు మంగళవారం సాయంత్రం లేగదూడకు చికిత్స అందించారు. వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేష్, గోసేవకులు సాకేత్, అర్జున్ రెడ్డి, ప్రణయ్, సందీప్, పశు వైద్యసిబ్బంది కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నిజామాబాద్‌నాగారం: ఏర్గట్ల మండలంలోని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారికి వైద్య చికిత్స నిమిత్తం మంగళవారం శ్రీలక్ష్మీచేయూత సేవా సమితి సభ్యులు రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు. అధ్యక్షుడు రమణాచారి, అల్వాల లక్ష్మణ్, గన్నారం పూర్ణచందర్, ట్రస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు

ఘనంగా పీర్ల ఊరేగింపు



నగరంలోని పాములబస్తీలో మంగళవారం పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లింలు, హిందువులు పాల్గొని పీర్ల చుట్టూ నీళ్లు పోశారు. అనంతరం స్థానిక దర్గాలో పీర్లను ఏర్పాటు చేశారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

317జీవో బాధితుల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రవ్యాప్తంగా 317 జీవో బాధితుల సమస్యలను పరిష్కరించాలని 317 ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ జేఏసీ కన్వీనర్ కట్ట దత్తాద్రి అన్నారు. ఈమేరకు ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. వాస్తవ బాధితులను గుర్తించి వారందరినీ వీలైనంత తొందరగా సొంత జిల్లాలకు కేటాయింపు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కొండా సురేష్, కార్యదర్శి ప్రవీణ్, మన్సూర్, రమేష్‌బాబు, ఇలియాజ్, నర్సయ్య, రవి, ఖాజా మెహినోద్దీన్ ఉన్నారు.